విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


విజేతలతో ఆర్చి ఫౌండేషన్, ఐఎఫ్‌ఎఫ్ సభ్యులు

చంపాపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించటంతో పాటు వారిలో నిగూఢమైన సృజనాత్మకతను వెలికి తీయాలని ఆర్చ్ ఫౌండేషన్ సభ్యురాలు, యురేకా క్విజ్ పోటీల కోఆర్డినేటర్ నివేదిత అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్రిస్టేజీ సమావేశ మందిరంలో ఆర్చి ఫౌండేషన్, ఐఎఫ్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలకు ఆమె హాజరై మాట్లాడారు. క్విజ్ మాస్టర్ శ్రీనివాస్ పాఠ్యాంశాలకు సంబధించిన ప్రశ్నలతో పాటు జీకే, జాతీయ, అంతర్జాతీయ ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలను రాబట్టారు. మల్లాపూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ట్రోఫీని గెలుచుకున్నారు. మీర్‌పేట, బడంగ్‌పేట, మల్లాపూర్, బాలాపూర్, నాదర్‌గూల్, చంపాపేట, కర్మన్‌ఘాట్, అల్మాస్‌గూడ, జిల్లెలగూడకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌ఎఫ్, ఆర్చ్ ఫౌండేషన్ సభ్యులు సాంకీ షా, ఆజ్రా, నవ్య, మాధవి, శ్వేత, సుకన్య, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

ఎల్‌బీనగర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని హోమియో ఆసుపత్రి ఆవరణలో చెత్త, చెదారం పేరుకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వైద్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన గురువారం పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టారు.


ఆసుపత్రి ఆవరణాన్ని శుభ్రం చేయిస్తున్న లచ్చిరెడ్డి

సమస్యల పరిష్కారానికి వినతి..

శివారు కాలనీల్లో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేక కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు.శివారు కాలనీల్లో డ్రైనేజీ, మంచి నీటి సౌకర్యం కలిపించాలని గురువారం జల మండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో రోడ్ల నిర్మాణం చేయలేకపోతున్నామని దీంతో కాలనీ రోడ్లపై రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రతి నెలా సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయించాలంటే ఇంటికి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం


ఎమ్మెల్యే బలాలకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం ఆయన అక్బర్‌బాగ్‌లో డివిజన్‌లో పర్యటిస్తూ ముంతాజ్ కాలేజీ లైన్‌లో సూపర్‌బజార్ నుంచి శర్మ ఆసుపత్రి వరకు కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పైపు లైన్ ఏర్పాటుతో కాలనీవాసులకు ప్రధాన సమస్య దూరమవుతుందన్నారు. అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, వాటర్ వర్క్స్ డీజీఎం హస్మత్ అలీ, ఏరియా మేనేజర్ అల్తాఫ్, కాలనీవాసులు శ్రీధర్‌రెడ్డి, కిషన్ ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం..

చంచల్‌గూడ: మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. చావునీ డివిజన్ పిల్లిగుడిసెలు డబుల్ బెడ్రూమ్ ప్రాంగణంలో గురువారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. మూసీ పరీవాహక ప్రాంతం నుంచి తరలించిన వారికి ప్రభుత్వం ఇక్కడి 'డబుల్' ఇళ్లను కేటాయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దాదాపు 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రజల అవసరాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సలామ్ షహిద్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్ల బాధ్యత మార్కెట్ అధికారులదే

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రాంగణమంతా బురదమయంగా మారుతుందిన వాటి బాధ్యత మార్కెట్ అధికారులే తీసుకోవాలని మలక్‌పేట జలమండలి డివిజన్–1 డీజీఎం సయ్యద్ హస్మత్‌అలీ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయిన మ్యాన్‌హోళ్లపై నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో మూతలు పగిలిపోతున్నాయన్నారు. మ్యాన్‌హోళ్లపై నుంచి వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


హస్మత్‌అలీ

సర్కిల్ కార్యాలయంలో పని చేయని లిఫ్ట్

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ మూడు సర్కిళ్ల కార్యాలయంలో లిఫ్ట్ పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయం రెండోవ అంతస్తు, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో మొదటి అంతస్తులో ఉన్నాయి. హయత్‌నగర్, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చిన వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడుతున్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డుపై పారుతున్న నీరు

తాగునీరు వృథా

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీనగర్ కాలనీలో డీపీఎస్ పాఠశాల వద్ద గత రెండ్రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. మంచి నీటి మ్యాన్‌హోల్ నుంచి భారీగా రోడ్డుపై పారుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


కిషోర్‌కుమార్

చైతన్యపురి: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన కత్రామని శ్రీనివాస్, కిషోర్‌కుమార్, వెంకటేష్ సోదరులు 20 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి మీర్‌పేట నందనవనం కాలనీలో నివసిస్తున్నారు. కిషోర్‌కుమార్ (34)కు మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సరూర్‌నగర్ చెరువు వద్ద తనకు కనిపించాడని సమీప బంధువు శ్రీహరి సమాచారం మేరకు చెరువు సమీపంలో వెతికినా కనిపించలేదు. గురువారం చెరువులో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు బయటకు తీయగా కిషోర్‌కుమార్ అని సోదరులు గుర్తించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

సైదాబాద్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రీన్‌పార్కు కాలనీలో నివసించే షేక్ సులేమాన్ కూతురు నాషీన్ సుల్తానా (18)కు ఇటీవలే నిశ్చితార్థం అయింది. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం సమయంలో సులేమాన్ ఆమెను సింగరేణి కాలనీలోని మదర్సా వద్ద దింపి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వస్తుంది. తమ బంధువుల అబ్బాయి సల్మాన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ సులేమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దుకాణానికి వెళ్తానని చెప్పి..


సాయిలక్ష్మి

గ్రీన్‌పార్క్ కాలనీలో నివసించే సతీష్‌కుమార్ ఆరు నెలల క్రితం సాయిలక్ష్మి (30)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. గత కొన్నిరోజులుగా ఇద్దరి నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 10న దుకాణానికి వెళ్తున్నాని అత్తామామలకు చెప్పి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. ఆమె బ్యాగులో ముందే రాసి పెట్టుకున్న ఓ లెటర్ దొరికింది. తన గురించి పీఎస్‌లో ఫిర్యాదు చేస్తే చనిపోతానని రాసి ఉంది. రెండు సార్లు భర్తకు ఇన్‌స్టాగామ్‌లోనూ తనను వెతకొద్దని.. నేను కలుస్తానని మెసేజ్ చేసింది. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో సతీష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసాడు.



రోడ్డు దాటాలంటే దడ

- ట్రాఫిక్ సిగ్నల్స్ లేక దూసుకొస్తున్న వాహనాలు
- ప్రమాదపుటంచున రాజీవ్‌గాంధీ నగర్ పాఠశాల విద్యార్థులు
- ఎఫ్‌ఓబీ నిర్మించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

బాటసారుల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఎఫ్‌ఓబీలు పలు ప్రాంతాల్లో నిర్మించకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన దుస్థితి నెలకొంది. పెద్దవాళ్లు ఎలాగో దాటేస్తుంటారు.. కానీ.. విద్యార్థులు నిత్యం ప్రమాదపుటంచున రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్ కాలనీ సమీపంలోని ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం పక్కనే రాజీవ్‌గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉంది. ఇందులో దాదాపు 800 మంది విద్యార్థులు ఉంటారు. పాఠశాల పక్కనే సికింద్రాబాద్ నుంచి శంషాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఉంది. అక్కడ నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ఎఫ్‌ఓబీ లేకపోవడంతో విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు భయంభయంతో రోడ్డు దాటుతున్నారు.

–నాగోలు

గతంలో విద్యార్థులకు గాయాలు..

రోడ్డుకు అవతలి వైపున్న పాఠశాలలకు రాజీవ్ గాంధీనగర్, భరత్‌నగర్, శివమ్మ నగర్, ఎన్జీఓఆర్‌నగర్, హరిపురికాలనీ, శ్రీనివాస్‌కాలనీ, హరిపురికాలనీ, ఆర్‌కేపురం ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ప్రతి రోజూ పాఠశాలకు రావాలన్నా.. తిరిగి ఇంటికి వెళ్లాలన్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటుతుంటారు. ఆ రహదారి మీదుగా వేగంగా దూసుకెళ్లే వాహనాలతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తోందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతుంటారు. గతంలో ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని సిగ్నల్స్, ట్రాఫిక్ సిబ్బంది..

గతంలో ఎల్‌బీనగర డీసీపీ కార్యాలయం సమీపంలో యూటర్న్ ఉండేది. ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం చేయడంతో అక్కడి యూటర్న్‌ను మూసేశారు. దీంతో ఎల్‌బీనగర్ నుంచి ఫ్లై ఓవర్‌పై నుంచి వచ్చిన వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం లేకపోవడంతో వేగంగా దూసుకొస్తుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీని సమీపంలోనే ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ అక్కడ ఎలాంటి ట్రాఫిక్ పోలీసులు రక్షణ పరికరాలు, సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం కూడా ప్రమాదాలకు తావునిస్తోంది. ఉదయం వెళ్లిన తమ పిల్లలు సాయంత్రం ఇంటికొచ్చే వరకు భయం భయంగా గడుపుతున్నామని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అప్పటి వరకైనా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు..



విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాలు వేగంగా వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రనిధులు ప్రత్యేక చొరవతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–మల్లేపాక యాదగిరి, రాజీవ్‌గాంధీనగర్

భయం భయంగా రోడ్డు దాటుతాం..



ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలంటే ప్రాణం అర చేతిలో పెట్టుకొని రోడ్డు దాటుతున్నాం. పాఠశాల సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనాలు వేగంగా దూసుకొస్తుంటాయి. పాఠశాలకు వెళ్లాలన్నా.. ఇంటికి రావాలన్నా రోడ్డు దాటడం పెద్ద గండంలా మారింది.

–బల్వీందర్ సింగ్, రాజీవ్‌గాంధీ పాఠశాల విద్యార్థి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు. టమాట రూ.43, వంకాయ రూ. 35, బెండ రూ. 55, పచ్చిమిర్చి రూ. 23–40, కాకర రూ. 32, బీర రూ. 45, క్యాబేజి రూ. 26, ఫ్రెంచి బీన్స్ రూ. 125, క్యారెట్ రూ. 53, దొండ రూ. 28–35, చిక్కుడు రూ. 23–65, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 32, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 17, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం


దామోదర్

చాదర్‌ఘాట్: రైతులు, వినియోగదారులు, వ్యాపారులతో నిత్యం రద్దీగా ఉండే మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో దాదాపు 400 దుకాణాలు 10 వరకు ఉల్లిపాయల షెడ్లు ఉన్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే వారికి దుకాణాల నెంబర్లు, షెడ్ల వివరాలు తెలియక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



లింగోజిగూడ: చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయంలో నిర్వహించే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని ట్రస్ట్ సభ్యులు శశికళ గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

సోషల్ మీడియాలో హోటల్‌పై అసత్య ప్రచారం

ఇద్దరిపై కేసు

లింగోజిగూడ: హయత్‌నగర్‌లోని సంగం హోటల్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెండ్రోజుల క్రితం సోషల్ మీడియాలో సంగం హోటల్‌లో టీ అమ్మే వ్యక్తి అల్లాన్ని కుక్కనోట్లో పెట్టి దానినే టీలో కలుపుతున్నాడని వీరేశం, నరసింహ పోస్ట్ చేశారు. ఈ విషయం హోటల్ నిర్వాహకులకు తెలియడంతో మేనేజర్ వీరేంద్ర ఫిర్యాదు మేరకు నరసింహ, వీరేశంపై కేసు నమోదు చేశారు. వీరిద్దరు యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తున్నట్లు పలువురు తెలిపారు. గతంలో హోటల్‌లో ఆహారం ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారని ఇవ్వనందుకే ఇలా హోటల్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలి



దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కే పురం డివిజన్ పరిధి గ్రీన్‌హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన సమర్థ సద్గురు సాయిబాబా మందిరంలో గురువారం మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరానికి తమ సొంత స్థలాన్ని విరాళంగా అందించిన బండపల్లి రీతా(అమల) సంతోష్‌ని, బండపల్లి కుటుంబ సభ్యులను అభినందించి, శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో భూకబ్జాదారుల నుంచి ఈ స్థలాన్ని కాపాడటంలో మాజీ కార్పొరేటర్ సురేఖ స్థల యజమానులు, గ్రీన్ హిల్స్ కాలనీ అసోసియేషన్ కృషి చేశారన్నారు. అందరూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, గడ్డి మధుసూదన్ రావు, రవీంద్ర, హరినాథ్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, కుంచారపు సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి


విస్తరణ పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ, కార్పొరేటర్లు

లింగోజిగూడ: జాతీయ రహదారి విస్తరణ పనుల ఆలస్యం కారణంగా వివిధ కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారని, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్, హయత్‌నగర్ కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. గురువారం వారు ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ మాట్లాడారు. యూటర్న్‌లు తీసుకోవాలంటే చాలా దూరం తిరిగి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. రోడ్డు దాటే పరిస్థితి లేని చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. యూటర్న్‌లను ఏర్పాటు చేసే విధంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు శ్రీనివాస్, గట్టు మల్లు, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ఇళ్లు కూల్చొద్దంటూ రాష్ట్రపతి, రాహుల్‌గాంధీకి ఉత్తరాలు


పోస్ట్‌కార్డులు చూపుతున్న కాలనీవాసులు

నాగోలు: చైతన్యపురి, కొత్తపేట మూసీ ప్రాంతంలోని వినాయకనగర్, న్యూమారుతినగర్ ఇతర కాలనీవాసులు ఉత్తరాల ద్వారా రాష్ట్రపతికి ద్రౌపతి ముర్ము, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మూసీ ప్రాంతంలో అన్ని అనుమతులతో ఇళ్లను నిర్మించుకుని ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్నామని, ఇప్పుడు అధికారులు అక్రమ నిర్మాణాలు అంటూ నోటీలిచ్చి కూల్చివేయడం దారుణమన్నారు. మూసీ సుందరీకరణ అవసరం లేదని, మా ఇళ్ల వద్దకు రావొద్దని కోరారు. ఈ విషయంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జోక్యం చేసుకుని కూల్చివేతలు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రాష్ట్రపతికి, రాహుల్‌గాంధీకి పోస్టుకార్డులను పంపించారు.



సాక్షి ఎఫెక్ట్..

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి సౌత్‌ఎండ్‌పార్క్‌కాలనీ ప్రధాన రోడ్డు మన్సూరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి నిత్యం దుర్వాసన వచ్చేది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోయారు. ఈ సమస్యపై 16న సాక్షిలో 'డ్రైనేజీ..లీకేజీ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జల మండలి, సివరేజీ బోర్డు అధికారులు స్పందించారు. గురువారం సంబంధిత సిబ్బందితో మ్యాన్‌హోల్‌లోని వ్యర్థాలను తొలగించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ప్రాంగణంలోని స్టాల్స్‌కు వేలం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంణంలోని పార్కింగ్ నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణ, అమ్మవారి శేషవస్త్రాల సేకరణ కోసం గురువారం జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ శేఖర్, ఈఓ ప్రేమ్‌కుమార్ సమక్షంలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నిర్వహించారు. వాహనాల పార్కింగ్ నిర్వహణను నరేష్ రూ.16.80 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణను సుభాష్ రూ. 5.61 లక్షలు, అమ్మవారి శేష వస్త్రాల సేకరణకు రూ. 1.11 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. పూజ సామగ్రి విక్రేత స్టాల్ నిర్వహణకు ఆలయ అధికారులు ఆశించిన విధంగా స్పందన రాకపోవటంతో వాయిదా వేశారు. ఈఓ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. స్టాల్స్ దక్కించుకన్న వారు ఆలయ నిబంధనల ప్రకారం ఏడాది పాటు నిర్వహణ బాధ్యత ఉంటుదని గతేడాది కన్నా ఈసారి ఆలయానికి వేలం ద్వారా రూ. 3.77 లక్షలు ఆదాయం వస్తున్నట్లు స్పష్టం చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని డీఏస్‌నగర్ బస్తీ కమ్యూనిటీహాల్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పార్కుల ప్రహరీ నిర్మాణ పనులను గురువారం ఆమె స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని కాలనీలు, బస్తీలవాసులు తమ ప్రాంతంలో ఏదైనా సమస్య ఉంటే వాటిని తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, ప్రశాంత్, రమేష్, జగన్, నర్సింగ్‌రావు, ధన్‌రాజ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: విద్యార్థులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఎస్ఐ రాములు, ఏఎస్ఐ అనురాధ తెలిపారు. రాచకొండ ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మానవ అక్రమ రవాణ, సైబర్ నేరాలు, మహిళలపై దాడులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం నేరమని, చిన్న పిల్లలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థులు, మహిళలు సైబర్ నేరాల బారిన పడితే సైబర్‌క్రైమ్స్ 1930, ఉమెన్స్‌కేంద్రం 1091, చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలని సూచించారు.

దళితులంతా ఐక్యంగా ఉండాలి


నియామకపత్రం అందజేస్తున్న పరుశురామ్

నాగోలు: దళితులంతా ఐక్యంగా ఉండాలని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ చైర్మన్ ఈదుల పరుశురామ్ మాదిగ అన్నారు. గురువారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశంలో పరుశురామ్ మాట్లాడారు. హక్కుల సాధనకు దళితులంతా ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. గత 20 ఏళ్ల నుంచి విద్యార్థి, దళిత ఉద్యమంలో పనిచేసిన చిప్పలపల్లి ఉపేందర్‌ని ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని వసంత్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, పద్మాలయ కాలనీ, గ్రీన్‌వుడ్ కాలనీల్లో గురువారం ఆయన అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరలో కాలనీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.కార్పొరేటర్ వెంట డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్ ఉన్నారు.

పరామర్శ


లక్ష్మమ్మను పరామర్శిస్తున్న నర్సింహగుప్తా

చైతన్యపురి: మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్ల కూల్చివేతల కోసం మార్కింగ్ చేస్తున్న సమయంలో ఆందోళనకు గురై అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన లక్ష్మమ్మను గురువారం చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా పరామర్శించారు. చైతన్యపురి డివజన్‌లోని మూసీ ప్రాంతంలో పర్యటించిన ఆయన నిర్వాసితులతో మాట్లాడారు.